సాక్షి తిరుపతి

మంగళవారం । 17 । జనవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.58,620
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,236
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,500
రిటైల్ వెండి గ్రాము	రూ.73.50

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	17
చిత్తూరు	30	16
తిరుమల	26	13
గూడూరు	31	19
నగరి	32	18



ఆనందాల కనుమ

తిరుపతి రూరల్: ఎస్వీ గోశాలలో కనుమ పండుగను పురస్కరించుకుని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైభవంగా సాయినాథుని తెప్పోత్సవం



పుష్కరణిలో సూర్యప్రభ వాహనంపై సాయిబాబా

వెంకటగిరి: కుమ్మరిగుంట సాయిబాబా ఆశ్రమం ఆధ్వర్యంలో సోమవారం సాయి నాథుని తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. కుమ్మరిగుంట పుష్కరణిలో సాయిబాబా సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పలు మండలాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి బాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయిబాబా చరిత్ర, లీలలు, ఆధ్యాత్మిక పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యప్రదర్శన, అష్టలక్ష్మి వైభవం నృత్యరూపకం భక్తులను అలరించాయి.

గరుడ వాహనంపై కనువిందు



రాపూరు: బంగారు గరుడ వాహనంపై శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారు ఉభయదేవేరులతో కలిసి కోన వీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. అంతకుముందు స్వామివారు చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం స్వాతి నక్షత్రం కావడంతో శాంతి హోమాన్ని జరిపించారు.

కొబ్బరి బోండాలపై శంఖు, చక్ర, నామాలు



తిరుమల: కోనసీమ జిల్లా మండపేటకు చెందిన రామారెడ్డి, మహాలక్ష్మి దంపతులు కొబ్బరి బోండాలపై శంఖు, చక్ర నామాలను చెక్కి సోమవారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి క్యాంపు కార్యాలయంలో చైర్మన్ దంపతులకు అందజేశారు. భద్రాచలం, ఒంటిమిట్ట, అంతర్వేది, అన్నవరం ఆలయాలకు ప్రత్యేక ఉత్సవాలు, కల్యాణం సందర్భంగా వీటిని అందిస్తూ వస్తున్నారు.

రంకేసిన పౌరుషం!

సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలంలోని రంగంపేట పరుష పందేలతో హోరెత్తింది. పౌరుషంతో కాలు దువ్వుతూ.. రంకెలేస్తూ పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు ప్రజానీకం పోటీపడింది. ఎద్ల కొమ్ములకు కట్టిన పలకలు, బహుమతులను సొంతం చేసుకుని విజయగర్వంతో ఊగిపోయింది. సుమారు మూడు గంటల పాటు ఎడ్ల పందేల జోరు ఉత్సాహంగా సాగింది. అలాగే మండలంలోని పుల్లయ్యగారిపల్లి, శేషాపురంలోనూ పరుష పందేరాలతో సందడి వాతావరణం నెలకొంది.



జల్లికట్టు..ఉడుంపట్టు!



నేను విజిలేస్తే..!

- రంగంపేటలో పరుష పందేల జోరు
- తండోపతండాలుగా తరలివచ్చిన జనం

చంద్రగిరి: మండలంలోని రంగంపేట సోమవారం జనంతో కిక్కిరిసిపోయింది. ఎడ్ల పందేలను తిలకించడానికి జిల్లా నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జనంతో ఇసుకేస్తే రాలనంతగా నిండిపోయింది. ఉమ్మడి జిల్లాలోనే ఎడ్ల పందేల(జల్లికట్టు)కు ఏ రంగంపేట ప్రసిద్ధి చెందింది. పశువుల పండుగను తిలకించడానికి మహిళలు సైతం మిద్దెలు, మేడలు ఎక్కి ఆసక్తికరంగా తిలకించడం కనిపించింది.

ముస్తాబు చేసి.. బహుమతులు కట్టి

మొదట పశువులకు కొమ్ములు చివ్వి, రంగులు అద్ది యజమానులు ముస్తాబు చేశారు. అనంతరం నడుముకు నల్లదారం కట్టి సింగారించారు. తర్వాత ఎడ్ల ఎమ్ములకు చెక్కతో తయారు చేసిన పలకలు, వాటి మధ్యలో బహుమతులు కట్టి జనంలోకి వదిలారు. వీటిని కైవశం చేసుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. పలువురు బహుమతులు సొంతం చేసుకుని విజయగర్వంతో ఊగిపోయారు.



ఎడ్ల పందేలను తిలకిస్తున్న అశేష జనవాహిని



చెట్టెక్కిన అభిమానం



గాయపడ్డ యువకుడిని ఆటోలో ఆస్పత్రికి తరలిస్తూ..



తగ్గేదేలే!

పలువురుకి గాయాలు

పరుష పందేరాలను తిలకించేందుకు వచ్చిన వారిలో కొంతమంది యువకులు పశువులను పట్టుకునే క్రమంలో గాయాలపాలయ్యారు. ఎద్దులను నిలువరించే క్రమంలో వాటి కొమ్ములు తగలడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బందిని వారిని హుటాహుటిన తిరుపతి రుయాకు తరలించారు.

ఉప్పొంగిన అభిమానం



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎత్తుకుని ఊరేగిస్తున్న ప్రజలు

చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన తనయుడు, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏ రంగంపేటకు విచ్చేసి ఎడ్ల పందేలను తిలకించారు. అంతకుముందు వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. అభిమాన నేత అయిన చెవిరెడ్డిని జనం ఎత్తుకుని కాసేపు ఊరేగించారు. అనంతరం ఆయన గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కారుకూతలు మానుకో బాబు!

- ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ప్రజలు ఊరుకోరు
- ఈ సారి జిల్లాలో పోటీచేసే పరిస్థితే ఉండదు
- బాబు జెండా మోయలేకే పవన్ చేతికిచ్చారు
- విలేకరుల సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, డెప్యూటీ సీఎం నారాయణస్వామి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : 'బాబు కారుకూతలు మానుకో. ఇష్ట మొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరు' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హెచ్చరించారు. తిరుపతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన ప్రతిసారీ ఏదో ఒకటి మాట్లాడి రెచ్చగొడుతున్నారని, పండగ పూటా తనతోపాటు తమ నాయకుడు వైఎస్ జగన్‌పై నోటికొచ్చినట్టు మాట్లాడారని తెలిపారు. కడప నుంచి వస్తూ దారిలో ఆయన కోసం ఎదురుచూస్తున్న కార్యకర్తలను చూసి ఒళ్లు మరిచి కారు కూతలు కూశారని మండిపడ్డారు. ఈ సారి జిల్లాలో బాబు తిరిగి పోటీచేసే పరిస్థితి కూడా ఉండదని తేల్చిచెప్పారు.

అది నీ తరం కాదు

చిత్తూరు జిల్లాలో టీడీపీ మెజారిటీ నీ తరం కాదని బాబుకు హితవు పలికారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. తన అంతు చూడాల్సిన పనిలేదని, చంద్రబాబు అంతు చిత్తూరు జిల్లా ప్రజలే చూస్తారని మంత్రి హెచ్చరించారు.

కొడుకును తలుచుకుని బాధపడుతున్నాడు

చంద్రబాబునాయుడు తన కొడుకు లోకేష్‌ను తలుచుకుని బాధపడుతున్నారని, వైఎస్ జగన్ లాంటి కొడుకు తనకు ఎందుకు పుట్టలేదని నిత్యం మదనపడుతున్నారని వివరించారు. ప్రతిదాన్నీ ఆలోచించుకుని ఉన్న అల్జీమర్స్‌ను మరింత పెంచుకుంటున్నాడని, విశ్రాంతి తీసుకుని ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు.

దానిని కూడా తప్పుపట్టడమేనా?

రఘురామకృష్ణమ రాజుకు కోర్టు రిమాండ్ విధిస్తే చంద్రబాబు దానిని కూడా తప్పుపట్టడం మంచిది కాదని మంత్రి హితవు పలికారు. న్యాయస్థానాలను తామెప్పుడూ గౌరవిస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. త్వరలో కుప్పంలో కూడా తన జెండాను పీకేస్తారని ఆయనకు అర్థమయ్యే జెండాను మోసే శక్తి లేక పవన్ కల్యాణ్‌కు ఇచ్చేశారని ఎద్దేవా చేశారు.

అవి గుర్తులేదా బాబు?

సీఎంగా ఉన్నప్పుడు ఎంత మందిని అకారణంగా అరెస్ట్ చేశావు?.. ఎంత మందిని ఇబ్బంది పెట్టావు? గుర్తులేదా బాబు..? అంటూ మంత్రి నిలదీశారు. నాడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అకారణంగా కేసుల్లో ఇరికించారని చెప్పారు. నాడు అకారణంగా ఎంపీ మిథున్‌రెడ్డిని జైల్లో పెట్టించలేదా.. అని ప్రశ్నించారు.

మైనారిటీలపై ఇప్పుడు ప్రేమ పుట్టుకొచ్చిందా..?

చంద్రబాబుకు ఉన్నట్టుండి ఇప్పుడు మైనారిటీలపై ప్రేమ పుట్టికొచ్చిందని మంత్రి మండిపడ్డారు. పుంగనూరు మున్సిపాలిటీని మైనారిటీలకు ఇచ్చామంటే వారిపై తమకు ఎంత ప్రేమ ఉందో బాబు గుర్తుచేసుకోవాలని మంత్రి సూచించారు.

తమ హయాంలోనే కుప్పం అభివృద్ధి

మారుమూల ప్రాంతమైన కుప్పానికి ఎవరూ రాకూడదని, ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా, అక్కడి ప్రజలు అభివృద్ధి చెందితే వారు అన్ని విషయాలను గ్రహిస్తారని కుట్రపూరితంగానే చంద్రబాబు కుప్పంను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాకే కుప్పంలో అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయన్నారు.

పెద్దిరెడ్డి పేరు వింటే చంద్రబాబు వెన్నులో వణుకు

తిరుపతి మంగళం : రాష్ట్రంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి, చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి పేరు వింటే చంద్రబాబు వెన్నులో వణుకు పుడుతోందని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం తిరుపతిలోని మంత్రి నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14ఏళ్ల చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కూడా చిత్తూరు జిల్లాలో 14 సీట్లుకు 10 సీట్లు తెప్పించిన మొనగాడు పెద్దిరెడ్డి అన్నారు. ఇప్పటికే ప్రజలు చంద్రబాబు సీటు చింపేశారని, దాంతో రోడ్డెక్కి పిచ్చివాడిలా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో పిచ్చి ముదిరి రోడ్లపై కాగితాలు ఏరుకుంటాడేమోనని అసహనం వ్యక్తం చేశారు. ఎవరైనా చనిపోతే రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేసే చంద్రబాబు తన వల్ల చనిపోయిన 11మందికి ఎన్ని కోట్ల రూపాయలు ఇచ్చారని ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డితో నిలబడి పోటీ చేసే దమ్ము, ధైర్యం బాబుకు ఉందా అని డెప్యూటీ సీఎం సవాల్ విసిరారు.

అభివృద్ధిలో మెరుస్తూ.. ప్రజల హృదయాలు గెలుస్తూ..



నారాయణి గార్డెన్స్‌లో సంక్రాంతి కానుకలను పంపిణీ చేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- 1.6 లక్షల కుటుంబాలకు చెవిరెడ్డి సంక్రాంతి కానుకలు
- కంటికిరెప్పలా కాపాడుకునే ఎమ్మెల్యే దొరకడం చంద్రగిరి ప్రజల అదృష్టం
- తన సంపాదనలో 70 శాతం నియోజకవర్గ ప్రజల కోసమే
- కుటుంబ సభ్యులకంటే మిన్నగా చూసుకోవడం ఆయనకే సాధ్యం
- టీటీడీ చైర్మన్‌వైవీ సుబ్బారెడ్డి వెల్లడి

చంద్రగిరి: 'ఆపదొచ్చినా.. ఆనందమొచ్చినా తన నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునే చెవిరెడ్డి వంటి ఎమ్మెల్యే దొరకడం చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు చేసుకున్న అదృష్టం. ఆర్థిక ఇబ్బందుల వల్ల పండుగ జరుపుకోలేని పేదలకు.. అన్నీతానై సంతోషాన్ని పంచడం.. కరోనా వంటి కష్టం వచ్చినా.. వరదలు వచ్చినా.. అనారోగ్యం పాలైనా.. అందరికీ నేనున్నాననే ధైర్యం కల్పించే చెవిరెడ్డి నిజంగా ప్రతిఒక్కరికీ ఆదర్శం. కుటుంబ సభ్యులకంటే తన నియోజకవర్గ ప్రజలను ఎక్కువగా ప్రేమించడం ఆయనకు మాత్రమే సాధ్యం' అని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కొనియాడారు. సోమవారం మండలంలోని తొండవాడ సమీపంలోని నారాయణి గార్డెన్స్‌లో ఇంటింటికీ బట్టల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి చంద్రగిరిలో 1.6 లక్షల కుటుంబాలకు సంక్రాంతి కానుకలు పంపిస్తూ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో తన నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు.

నేనున్నాననే ధైర్యం.. ప్రతి ఒక్కరికీ ఆదర్శం

చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ప్రతినిత్యం ఏదో ఒకరకంగా కానుకలు పంపించి ఆనందపరచడమేగాక కరోనా వంటి విపత్కర సమయంలో మాస్కులు, శానిటైజర్, టాబ్లెట్లు, కాయగూరలు, కోడి గుడ్లు, ఆపిల్, దానిమ్మ, ఆరంజ్ వంటి వాటిని పంపిణీ చేస్తుంటే ప్రజలపై ఆయనకున్న ప్రేమ ఎలాంటిదో తెలుస్తోందన్నారు. క్వారంటైన్ కేంద్రాల్లో కంటికి రెప్పలా కాపాడారని, ఆ తర్వాత ఆయుర్వేద మూలికలతో తయారు చేయించిన ఆనందయ్య మందును అందించి కాపాడారన్నారు. ఆ తర్వాత వరదల్లో చిక్కిన ప్రజలకు హెలికాప్టర్ల ద్వారా ఆహారం అందించి, రాయల చెరువుకు గండి పడితే లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారని చెప్పారు.

టీటీడీ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు



భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి

తిరుమల: తిరుమలలోని పాత అన్నదానం కాంప్లెక్స్‌లో సోమవారం మధ్యాహ్నం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. క్యూలో ఉన్న భక్తులతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించారు.

ఎంబీసీ వద్ద మినీ అన్నదానం కాంప్లెక్స్

శ్రీవారి మెట్టు నడకదారిలో వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎంబీసీ ప్రాంతంలో మినీ అన్నదానం కాంప్లెక్స్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని టీటీడీ చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఆయన అధికారులతో కలిసి శ్రీవారి మెట్టు నుంచి భక్తులు తిరుమలకు చేరుకునే ప్రాంతాన్ని పరిశీలించారు. నడిచి వచ్చిన పలువురు భక్తులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో మినీ అన్నదానం కాంప్లెక్స్ ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఆర్‌బీసీ సెంటర్లోని నివాసగృహాలను పరిశీలించారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఆరాధన కేంద్రం నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఇంకా మిగిలి ఉన్న ఇళ్లను తొలగించి పార్కింగ్ ప్రాంతంగా తయారు చేయాలని అధికారులకు సూచించారు.

గో పూజలో చైర్మన్

కనుమ పండుగ సందర్భంగా తిరుమలలోని గోశాలలో జరిగిన గోపూజలో టీటీడీ చైర్మన్ పాల్గొన్నారు. గోమాతకు పూలు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు.

మతసామరస్యానికి ప్రతీక.. ఏటి పండుగ



బెలూన్ ఆవిష్కరించి ఏటిపండుగ వేడుకలను ప్రారంభించిన ఎమ్మెల్యే కిలివేటి, నాయకులు



గొబ్బెమ్మలను నదిలో నిమజ్జనం చేస్తున్న మహిళలు

నాయుడుపేటటౌన్ : సంక్రాంతిని పురస్కరించుకుని నాయుడుపేట స్వర్ణముఖి నదిలో జరుపుకునే ఏటి పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సంబరాలను మొదటి రోజు సోమవారం సాయంత్రం ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎంపీపీలు ధనలక్ష్మి, అరుణరెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి తదితర నాయకులు కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎంపీ గురుమూర్తి ముఖచిత్రాలు కలిగిన భారీ బెలూన్‌ను ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారంచేసిన రోజు నుంచే సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంక్రాంతి పండుగను ఆనందంగా చేసుకుంటున్నట్టు తెలిపారు. ఏటి పండుగ సంబరాలకు కుల, మత, పార్టీ లతో ప్రమేయం లేకుండా అందరూ తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బైనా మల్లికార్జునరెడ్డి, కె.జయరామయ్య, గంధవల్లి సిద్ధయ్య, కిషోర్ యాదవ్, కె.మాధవరెడ్డి, దారా రవి, చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఏటి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆటపాటలతో పాటు పలువురు సినీ గాయకులు, బుల్లితెర నటీనటులు ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమాలకు దాతగా మురళిరెడ్డి వ్యవహరించారు.

కనువిందు చేసిన మ్యూజికల్ నైట్

నిస్సీ ఈవెంట్ ఆర్గనైజ్ చేసిన మ్యూజికల్ నైట్‌లో గాయకులు సుగంధి, అమల, హరి ఆలపించిన గేయాలు అకట్టుకున్నాయి. యాంకర్ మనీషతో పాటు బాలసుబ్రహ్మణ్యం ప్రియ శిష్యులు కీబోర్డు విజయ్ బృందం, డ్యాన్స్ మాస్టర్ యోహాన్, రాజేష్ బృందం సంగీత కచేరి కోలాహలంగా సాగింది.

భార్యపై అనుమానంతో హత్య?



ఉమామహేశ్వరి (ఫైల్‌ఫోటో)

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన ఓ వివాహిత సోమవారం మృతి చెందింది. ఆమెపై అనుమానంతో నిత్యం గొడవపడుతున్న ఆమె భర్తే హతమార్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ అంజుయాదవ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన భాస్కరయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో రెండవ కుమార్తె ఉమామహేశ్వరిని సూళ్లూరుపేటకు చెందిన తన మేనల్లుడు చెంగయ్యకు ఇచ్చి వివాహం చేశాడు. చెంగయ్య శ్రీకాళహస్తిలోని అత్తవారింటికి ఇల్లరికం వచ్చాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉమామహేశ్వరి ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తోంది. ఇటీవల ఆమెపై అనుమానంతో చెంగయ్య తరచూ గొడవపడుతుండేవాడు. ఆదివారం రాత్రి పిల్లలు అమ్మమ్మ ఇంట్లో నిద్రించగా దంపతులిద్దరే ఉన్నారు. సోమవారం ఉదయం ఉమామహేశ్వరి ఫోన్ పనిచేయకపోవడంతో ఆమె కుటుంబసభ్యులు ఇంటి వద్దకు వచ్చారు. అప్పటికే తలపై బలమైన గాయం అయి ఉమామహేశ్వరి మృతి చెందినట్లు గుర్తించారు. 1వ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ అంజుయాదవ్ ఘటన స్థలానికి చేరుకుని హత్యకేసుగా నమోదు చేశారు. భర్త చెంగయ్య పరారీలో ఉన్నాడు. దీంతో అతనే హత్యచేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

కనులపండువగా గోదాదేవి కల్యాణం



మంగళసూత్రాలను చూపుతున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: టీటీడీ పరిపాలనా భవనం ప్రాంగణంలోని మైదానంలో ఆదివారం రాత్రి గోదాదేవి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణస్వామి, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేశారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపైకి వేంచేపు చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన గోదాదేవి కల్యాణం నృత్య రూపకం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తర్వాత తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు శ్రీవిష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణం, రక్షా బంధనం, అగ్నిప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. సర్కారు సంకల్పం, భక్తుల సంకల్పం, మధుపర్క నివేదనం, వస్త్ర సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం మహా సంకల్పం, స్వామి, అమ్మవార్ల ప్రవరలు, మాంగల్య పూజ, మాంగల్య ధారణ చేశారు. ప్రధాన హోమం, లాజ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపించారు. చివరిగా నివేద, మంగళ హారతులు సమర్పించారు. గోవింద నామ సంకీర్తనలతో గోదాదేవి కల్యాణం అత్యంత వేడుకగా ముగిసింది. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ గోదాదేవి కల్యాణ విశిష్టతను వివరించారు. టీటీడీ జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్ఓ నరసింహకిషోర్, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్‌కుమార్, వీజీఓ మనోహర్, ఎస్టేట్ ఓఎస్‌డీఓ మల్లికార్జున, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణశేషాచల దీక్షితులు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ ఎం.సుధాకర్, డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, శ్రీవారి ఆలయ పారుపత్తేదారు ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



పరిణయోత్సవంలో గోదాదేవితో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ మహద్వారం వద్ద గోదాదేవికి, కల్యాణ వెంకటేశ్వరస్వామికి మాల మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహించి, కల్యాణ మండలంలో ఆస్థానాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. గోదాకల్యాణాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తలరివచ్చారు.

వనం.. జనం!

- వైభవంగా గిరిప్రదక్షిణ
- తరలివచ్చిన భక్తజనం



గిరిప్రదక్షిణ మార్గంలో శివపార్వతులు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



స్వామి, అమ్మవార్ల ఊరేగింపులో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలో సోమవారం వైభవంగా గిరి ప్రదక్షిణ జరిగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వామి అమ్మవార్లకు కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా స్వామి, అమ్మవార్లు ప్రతి ఏటా కనుమ పండుగ రోజు కైలాస గిరిప్రదక్షిణ చేసి దేవతలు, రుషులను ఆహ్వానిస్తారు. ఈ నేపథ్యంలో మొదట జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి ఆలయ అలంకార మండపంలో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఉత్సవమూర్తులను చప్పరాలపై అధిష్టింపజేసి కైలాస గిరిప్రదక్షిణకు సాగనంపారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ఘనంగా స్వాగతం పలికారు. చతుర్మాడ వీధుల్లో శివనామస్మరణ మార్మోగింది. స్వామి, అమ్మవార్లు జయరామరావువీధి, కైలాసగిరి కాలనీ, రామచంద్రాపురం, రాజీవ్‌నగర్ మీదుగా రామాపురం రిజర్వాయరు సమీపంలోని అంజూరు మండపం వద్దకు చేరుకున్నారు. భక్తులకు ఆలయ అధికారులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లు వేయిలింగాలకోన, వేడం మీదుగా శుకబ్రహ్మాశ్రమం వద్ద ఉన్న ఎదురుసేవ మండపం వద్దకు చేరుకున్నారు. కొండకోనల్లో పలు తీర్థాలు సందర్శిస్తూ, వివిధ దేవతామూర్తులను దర్శిస్తూ భక్తులు పరవశించిపోయారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, ఆర్డీఓ రామారావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

లోకకల్యాణార్థం ప్రత్యేక హోమాలు

- శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రారంభం
- ఆరు రోజుల పాటు నిర్వహణ
- హాజరైన టీటీడీ చైర్మన్ దంపతులు



కపిలేశ్వరస్వామి వారి ఆలయంలో హోమపూజ ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు

తిరుపతి కల్చరల్: లోక కల్యాణార్థం ఆరురోజుల పాటు నిర్వహించ తలపెట్టిన హోమ మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఈ హోమ మహోత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం గణపతి పూజతో హోమ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. 17న మంగళవారం శ్రీసుబ్రమణ్యస్వామివారి హోమం, 18న శ్రీదుర్గ,శ్రీలక్ష్మి, శ్రీసరస్వతీ అమ్మవార్ల హోమం, 19న శ్రీనవగ్రహ హోమం నిర్వహిస్తారు. అలాగే 20వ తేదీన శ్రీదక్షిణామూర్తి స్వామివారి హోమం, 21న శ్రీరుద్ర, శ్రీమృత్యుంజయ స్వామివారి హోమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, సీవీఎస్వో నరసింహకిషోర్, డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, భక్తులు పాల్గొన్నారు.

18న కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

పుంగనూరు : పాలసముద్రం ఉన్నత పాఠశాలలో బుధవారం కబడ్డీ పురుషుల జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ సంఘం కార్యదర్శి పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 85 కేజీల బరువుగల క్రీడాకారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన జట్టు ఈ నెల 25వ తేదీ నుంచి అనకాపల్లెలో నిర్వహించనున్న అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఇతర వివరాలకు 9440934507 నంబర్లో సంప్రదించాలని కోరారు.

అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి



తిరుచానూరు ఆలయం వద్ద కేంద్ర మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవర్‌తో అధికారులు

తిరుచానూరు: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ సోమవారం కుటుంబ సమేతంగా శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ అర్చకులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వస్తూ..

- మామండూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరి దుర్మరణం
- మరో ఇద్దరి పరిస్థితి విషమం



మామండూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం



మృతులు నగేష్(ఫైల్)



శ్రావణ్‌కుమార్(ఫైల్)

రేణిగుంట: తిరుమలేశుని దర్శనానికి వస్తూ మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రేణిగుంట ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. హైదరాబాద్ మూసాపేటకు చెందిన నగేష్, అతని తోడల్లుడు లక్ష్మీ నారాయణ ప్రైవేటు సంస్థ ఉద్యోగులు. నగేష్‌కు భార్య రాధిక, కుమారుడు శరత్‌కుమార్, కుమార్తె సంజన, లక్ష్మీనారాయణకు భార్య అపర్ణ, కుమారుడు శ్రావణ్‌కుమార్, కుమార్తె స్వాతి ఉన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా నందిగామ మండలం మగల్లు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కుటుంబం కూడా ఉద్యోగరీత్యా 25ఏళ్ల నుంచి హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. తిరుమలలో మొక్కు తీర్చుకునేందుకు వీరి రెండు కుటుంబాల సభ్యులు శనివారం రాత్రి కారులో హైదరాబాద్ నుంచి తిరుమల దర్శనానికి బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున కడప–రేణిగుంట మార్గం రేణిగుంట మండలం మామండూరు వద్ద ఎదురుగా ఆర్‌టీసీ బస్సు వస్తుండడంతో ముందు ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నగేష్(41), శ్రావణ్‌కుమార్(19) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు నగేష్ భార్య రాధిక, కుమార్తె సంజన తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం వీరిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. లక్ష్మీనారాయణ, అతని భార్య అపర్ణ, కుమార్తె స్వాతి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

శోకసంద్రమైన రెండు కుటుంబాలు

ప్రమాదంలో ఓ కుటుంబంలో కుటుంబ పెద్ద దిక్కు మృత్యు ఒడికి చేరగా, మరో కుటుంబంలో ఒక్కగానొక్క కుమారుడు తిరిగిరాని లోకాలకు చేరడంతో రెండు కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుని తీరని శోకాన్ని మిగిల్చింది. నగేష్ మృతి చెందగా, అతని భార్య రాధిక, కుమార్తె సంజన పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో తండ్రిని కోల్పోయిన తనకు తల్లి, చెల్లినైనా తోడుగా నిలుపు భగవంతుడా.. అంటూ నగేష్ కుమారుడు శరత్‌కుమార్ రోధించిన తీరు వర్ణనాతీతం. లక్ష్మీనారాయణ, అతని భార్య అపర్ణ, కుమార్తె స్వాతి స్వల్ప గాయాలతో బయటపడగా, కుమారుడు శ్రావణ్‌కుమార్ మృతి చెందడంతో వీరి కుటుంబం దుఃఖసాగరంలో మునిగింది. మధ్యప్రదేశ్ రాష్ట్రం సాయిఖేదాలోని జీఎచ్ రాయ్‌సోని యూనివర్సిటీలో శ్రవణ్‌కుమార్ అగ్రికల్చరల్ బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చి తిరుమల దర్శనానికి వెళుతూ జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు.

టీ తాగేందుకు లారీ ఆపి..

హోస్పేట నుంచి చెన్నైకి ఐరన్ లోడుతో వెళుతున్న లారీని డ్రైవర్ టీ తాగేందుకు మామండూరు రోడ్డు పక్కన ఆపాడు. అయితే ఎలాంటి సిగ్నల్ లైటు వేయకుండా ఆపడంతో ఎదురుగా వస్తున్న బస్సు లైటింగ్‌కు ముందు ఆగి ఉన్న లారీ కనిపించకపోవడంతో కారు లారీని ఢీకొంది. రేణిగుంట ఎస్ఐ ఈశ్వరయ్య ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను చికిత్స నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. నగేష్ మృతదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకెళ్లగా, శ్రవణ్‌కుమార్ మృతదేహాన్ని అంతిమ సంస్కారాల కోసం వారి స్వగ్రామం ఎన్‌టీఆర్ జిల్లా నందిగామ మండలం మగల్లు గ్రామానికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.